## క్లుప్తంగా

### విప్ అడ్లూరి, ఎమ్మెల్సీని కలిసిన నరేందర్‌రెడ్డి



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్‌తో నరేందర్‌రెడ్డి

**జగిత్యాలటౌన్:** నిజామాబాద్,ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి సోమవారం జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసిన నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, గాజంగి నందయ్య తదితరులు ఉన్నారు.

### మీ సేవ కేంద్రాల్లో త్వరగా సేవలు



మీసేవ కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మెట్‌పల్లిరూరల్:** మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు త్వరగా సేవలు అందుతాయని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు ముదాం సింధు-హరీశ్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, నాయకులు నర్సింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

**మల్యాల:** భారతదేశంలోని నిరుపేదల అభివృద్ధికి తోడ్పడే బడ్జెట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు మల్యాల అంగడి బజార్‌లో సోమవారం ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బింగి వేణు, సంగని రవి, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బొట్ల ప్రసాద్, కెల్లేటి రమేశ్, చక్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

**మల్లాపూర్:** మండలంలోని రేగుంటలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, యంత్రస్థాపన, అష్ట బలిహరణం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, హైకోర్టు అడ్వకేట్ బైరినేని ప్రదీప్‌రావు-కవిత దంపతులు, స్థానిక నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కిడ్నాప్ కలకలం

**జగిత్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో సోమవారం మధ్యాహ్నం బాలికను కిడ్నాప్ చేసేందుకు వచ్చారని ఓ యువకుడు, మహిళకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు.. మెట్‌పల్లి పట్టణంలోని బస్టాండ్ ముందు చెట్ల కింద నివసించే రాజు, లక్ష్మిలు సోమవారం జగిత్యాల బాలసదన్‌లో ఉంటున్న తన కూతురును చూసేందుకు వచ్చారు. మద్యం మత్తులో ఉన్న భార్యాభర్తలు కుమారున్ని వెంట పెట్టుకుని చింతకుంటవాడలో భిక్షాటనకు వెళ్లారు. అక్కడే ఉన్న మారుతి కూతురు బయట ఆడుకుంటుండగా వీరిని చూసి ఏడ్చుకుంటూ ఇంట్లోకి పరుగెత్తింది. దీంతో వారు కిడ్నాప్ చేసేందుకు వచ్చారని స్థానికులు పట్టుకుని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో కూతురును చూసేందుకు వచ్చినట్లు వెల్లడించారు. కాగా, గతంలో మెట్‌పల్లిలో వీరు మద్యం మత్తులో చిన్నారిని వదిలిపెట్టడంతో పోలీసులు ఆ చిన్నారిని బాలసదన్‌కు అప్పగించారు. ఈ విషయంపై పట్టణ సీఐ వేణుగోపాల్‌ను వివరణ కోరగా, చింతకుంటవాడలో భిక్షాటనకు వెళ్లిన రాజు, లక్ష్మిని స్థానికులు కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు అప్పగించారని, విచారణలో తమ కూతురును చూసేందుకు వచ్చినట్లు వెల్లడైందని చెప్పారు.

## భక్తి శ్రద్ధలతో వసంత పంచమి

**జగిత్యాలజోన్/కోరుట్లటౌన్/రాయికల్/ధర్మపురి/మల్యాల/కథలాపూర్/పెగడపల్లి/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్ /సారంగాపూర్:** వసంత పంచమి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆలయాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, పుస్తక పూజ, విజయ కంకణ ధారణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.



జగిత్యాల జోన్: సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు



ధర్మపురి ఆలయంలో ప్రత్యేక పూజలు



రాయికల్: భూపతిపూర్ ప్రాథమిక పాఠశాలలో వేడుకల్లో విద్యార్థులు



మల్యాలలో సామూహిక అక్షరాభ్యాసం



సారంగాపూర్: విద్యార్థులకు ప్యాడ్లు, నోట్‌బుక్‌లు పంపిణీ



పెగడపల్లి: దోమలకుంట అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



మెట్‌పల్లిరూరల్: రాధాకృష్ణులకు వివిధ రకాల నైవేద్యాలు



మల్లాపూర్ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన



కథలాపూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం



మెట్‌పల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం

## క్రీడా రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విజేతలకు మెమెంటో అందిస్తున్న విప్

**పెగడపల్లి:** గ్రామీణ క్రీడాకారులను పోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో మండలంలోని నామాపూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనిరెడ్డి సతీష్‌రెడ్డి, పవన్‌రెడ్డి, నాయకులు, ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

**ఆలయ నిర్మాణం అదృష్టం**

**వెల్గటూర్ :** అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం తన అదృష్టమని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం వసంత పంచమి సందర్భంగా వెల్గటూర్ మండల కేంద్రంలో నూతన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ కేడీసీసీ డైరెక్టర్ రాంమ్మోహన్‌రావు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి**

**జగిత్యాలటౌన్:** విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అమ్మవారిని వేడుకున్నారు. వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం జగిత్యాలలో సరస్వతీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## 'లక్ష డప్పులు, వెయ్యి గొంతులు' విజయవంతం చేయాలి



కథలాపూర్‌లో డప్పుచప్పుళ్లతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**కథలాపూర్:** కథలాపూర్ మండలకేంద్రంలో అంబేద్కర్ మాదిగ సంఘం సభ్యులు సోమవారం డప్పుల చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పులు' కార్యక్రమానికి కులసంఘం సభ్యులు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధులు కాశవత్తుల లక్ష్మీరాజం, తెడ్డు శేఖర్, మండలాధ్యక్షుడు మారంపెల్లి వినోద్, నాయకులు పాల్గొన్నారు.

**సారంగాపూర్:** ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు... వెయ్యి గొంతులు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్ మాదిగ అన్నారు. బీర్పూర్‌లో మాట్లాడారు. సభను విజయవంతం చేసేందుకు జిల్లాలోని మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుద్దాల తిరుపతి, పసుల రాజు పాల్గొన్నారు.

**కోరుట్ల:** ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష గొంతులు, వేల డప్పులు' కళా ప్రదర్శన విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని బస్టాండ్ వద్ద సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి మహా సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాకారుల జిల్లా అధ్యక్షుడు మారంపెల్లి శ్రీధర్, పట్టణ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మోర్తాడ్ రాజశేఖర్, డివిజన్ అధ్యక్షుడు వినోద్, మండల అధ్యక్షుడు కంటాల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి కృషి చేయాలి

**రాయికల్:** చెన్నకేశవనాథ ఆలయాభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. సోమవారం చెన్నకేశవనాథ ఆలయ పాలకమండలికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మంతెన మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పాల్గొన్నారు.

**రేషన్ బియ్యం పట్టివేత**

**మెట్‌పల్లి:** అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి తనిఖీ చేస్తుండగా, వ్యాన్‌లో పట్టణానికి చెందిన అజీమ్ వచ్చాడని, తనిఖీ చేయగా, అందులో రేషన్ బియ్యం ఉండడంతో పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

## ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ

**ఇబ్రహీంపట్నం:** మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సోమవారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని స్టాక్ రిజిస్టర్లను, టాయిలెట్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా, అన్ని రకాల వసతులు ఉన్నాయా, భోజనం రుచికరంగా ఉందా, పెంచిన కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నారా అని అడుగగా, విద్యార్థులు భోజనం రుచికరంగా ఉంది, అన్ని వసతులు ఉన్నాయి, మా వార్డెన్ మంచిగానే చూసుకుంటున్నారని సమాధానం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పెద్దులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మినీ గురుకులంలో తహసీల్దార్..

**రాయికల్:** మండలంలోని ఒడ్డెలింగాపూర్ మినీ గురుకులాన్ని సోమవారం తహసీల్దార్ ఖయ్యూం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం తరగతి గదులు, కిచెన్, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట పీఆర్ ఏఈ ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీలత ఉన్నారు.

**గిరిజన సంఘ భవనానికి స్థలం కేటాయించాలి**

**పెగడపల్లి:** సేవాలాల్ మహారాజ్ కమిటీ భవనం నిర్మాణం కోసం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం కేటాయించాలని బంజారా గిరిజన సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్టీ యూనియన్ నియోజకవర్గం అధ్యక్షుడు జీవన్ నాయక్, మాజీ సర్పంచి హరిలాల్‌నాయక్, అజ్మీరా భూమానాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

**టీచర్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలని వినతి**

**రాయికల్:** సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీవో సుష్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్ మాట్లాడుతూ విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌తో పాటు, డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంబాల శ్రీనివాస్‌రెడ్డి, గాజంగి రాజేశం, సతీశ్, అభయ్‌రాజ్, చిలువేరి రమేశ్, మహేశ్, పురుషోత్తం, రాము పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

**జగిత్యాల:** పదో తరగతి విద్యార్థులు పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రాము అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో ముద్రించిన ప్రతిభ పరీక్ష పత్రాలను సోమవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు సమీర్ అక్రమ్, ప్రణయ్, రాజేందర్ పాల్గొన్నారు.

## బావోజీపల్లిని గ్రామపంచాయతీ చేయాలి



ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామం బావోజీపల్లిని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**బాధితుడికి ఎల్‌వోసీ ..**

**రాయికల్:** మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన కొత్తూరి ప్రసాద్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నిమ్స్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌వోసీని సోమవారం ప్రసాద్‌కు అందజేశారు.

**ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత**

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రేణుక ఎల్లమ్మ బోనాల పండగకు హాజరు కావాలని సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంకం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## నియామకం

**జగిత్యాలరూరల్/మెట్‌పల్లి:** బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నలువాల తిరుపతిని నియమిస్తూ బీజేపీ సంస్థాగత ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన తిరుపతి గతంలో మండల అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఏలేటి నరేందర్‌రెడ్డిని మరోసారి నియమించారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ అర్వింద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**నేడు రాజకీయ నాయకులతో సమావేశం**

**మల్యాల:** గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవోవో స్వాతి తెలిపారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు మండల పరిషత్‌లో ఏర్పాటు చేసే సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

**విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం**

**జగిత్యాల:** విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమని టాస్క్ ట్రైనర్ కౌసల్య అన్నారు. సోమవారం మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 21 సెంచరీ ట్రాన్స్‌ఫరబుల్స్ స్కిల్స్‌పై విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, కో-ఆర్డినేటర్ వాసవి, అధ్యాపకులు నీరజ,రామకృష్ణ, రహీం, శ్రీలత పాల్గొన్నారు.

**రాజగోపురం నిర్మాణానికి విరాళం**

**సారంగాపూర్:** పెంబట్లలోని ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ రాజగోపురం నిర్మాణానికి సోమవారం పలువురు దాతలు రూ.5 లక్షలు విరాళం అందజేశారు.

**ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు**

**జగిత్యాలటౌన్:** మల్లాపూర్ మండలం సాతారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంబటి భూమేశ్వర్ మూఢ నమ్మకాలను ప్రోత్సహిస్తూ గ్రామదేవతలకు బలిచ్చే కార్యక్రమంలో పాల్గొన్నాడని జంతు సంరక్షణ కమిటీ కన్వీనర్ బి రమేశ్ సోమవారం ప్రజావాణిలో జగిత్యాల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎంపీటీసీ స్థానాల ప్రకటన**

**బుగ్గారం:** మండలంలోని ఎంపీటీసీ స్థానాలను ప్రకటిస్తూ సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయాలలో,ఎంపీడీవో కార్యాలయాలలో ప్రకటన జారీ చేశారు. మండలంలో గతంలో ఉన్న ఆరు ఎంపీటీసీ స్థానాలనే యథావిధిగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మొదట ప్రకటించిన జాబితాలో వెల్గొండ,చిన్నాపూర్ ఒకే స్థానంగా ప్రకటించగా ఆయా గ్రామాల ప్రజల అభ్యంతరాల మేరకు మళ్ళీ పాత స్థానాలనే ఖరారు చేస్తూ ప్రకటన జారీ చేశారు.

**సీసీ కెమెరాల వితరణ**

**మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు రూ.50 వేల విలువగల సీసీకెమెరాలను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మకిలీ ఇజ్రాయిల్, తేలు నరేశ్, బలగం రాజేశ్, మార్గం నర్సారెడ్డి, వినయ్‌రెడ్డి, పాల్గొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

**రాయికల్:** మండలంలోని అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, వీరాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి 1 గంటల వరకు, రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నవీన్ సోమవారం తెలిపారు.

**గీత పారిశ్రామిక సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్**

**మెట్‌పల్లి:** పట్టణంలోని గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను సోమవారం ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. ఎన్నిక ఈ నెల 17న జరగనుండగా..7 తేదీ నుంచి 10 తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11న పరిశీలన, అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఓటింగ్ 17న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తారు.

**ఓటరు జాబితా ప్రదర్శన**

**పెగడపల్లి:** గ్రామ పంచాయతీల ఓటరు జాబితాలను సోమవారం పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు ప్రదర్శించారు. ఈ జాబితాల్లో అభ్యంతరాలపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.



**ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం**

**కోరుట్ల రూరల్:** మండలంలోని జోగిన్‌పెల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు.



**రథసప్తమి వేడుకలు**

**జగిత్యాలటౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీధన్వంతరి ఆలయంలో సోమవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సోమవారం సూర్యభగవానుని శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలుకముక్కు నాగరాజు, విష్ణు శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ఫౌండర్ డాక్టర్ రాజన్న, ఆలయ అధ్యక్షుడు పాల్తెపు శంకర్, మాతలు పాల్గొన్నారు.